

మానకొండూర్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

# ముస్లింలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు


- ఆ పార్టీ హయాంలో ఎప్పుడూ మతఘర్షణలు, కర్ఫ్యూలే
- బీఆర్ఎస్ పాలనలోనే మైనార్టీలకు మేలు
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయం
- హోం మంత్రి మహమూద్ అలీ

మానకొండూర్, నవంబర్ 23: కాంగ్రెస్ మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంది తప్ప వారి సంక్షేమానికి చేసిందేమీ లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. బుధవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలనలో వెనుకబడిన తెలంగాణ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాతే అన్ని రంగాల్లో అభివృద్ధి సా ధించిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడితే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని, అభివృద్ధి కుంటుపడుతుదని కాంగ్రెస్ నాయకులు, ఢిల్లీ పెద్ద లు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్నారని వాపోయారు. ఉద్యమనేత కేసీఆర్ ప్రాణాలకు తెగించి చేపట్టిన ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఏర్పడిందే తప్ప కాంగ్రెస్ పెట్టిన భిక్ష కాదన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ మత ఘర్షణలు, కర్ఫ్యూలు జరుగుతుండేవని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్ పాలనతో రాష్ట్రంలో అవి మచ్చుకైన లేవని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో దుర్భర జీవితం గడిపిన మైనార్టీలకు బీఆర్ఎస్ పాలనలోనే మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు, సాగు నీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. కాళేశ్వర ప్రాజెక్ట్ నిర్మాణంతో తాగు, సాగు నీరు పెరగడమే కాకుండా ధాన్య ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే నిజమైన సెక్యులర్ నాయకుడని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లు కైవసం చేసుకుంటుందని, సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ వెన్నంటి ఉండి ఉద్యమ పాటలతో ప్రజలను చైతన్యవంతం చేసిన మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, మైనార్టీ నాయకులు అక్బర్‌హుస్సేన్, జమీలుద్దీన్, సయ్యద్ ఖలీల్ మోహియెద్దీన్, లాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

విద్యానగర్, నవంబర్ 23: వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి సూచించారు. గురువారం ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉన్న పాలియేటివ్ కేర్ సెంటర్, పీపీయూనిట్, టీ హబ్, ఆర్టీపీసీఆర్ సెంటర్, టీబీ సెంటర్‌ను తనిఖీ చేశారు. వార్డులో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పాలియేటివ్ కేర్ సెంటర్‌లో వైద్యం చేస్తున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఎప్పటికప్పుడు రో గుల వివరాలను అందించాలని సూచించారు. ఇ ప్పటికే అర్బన్ హెల్త్ సెంటర్లలో బయోమెట్రిక్ ఏ ర్పాటు చేయడంతో సమయ పాలన పాటిస్తున్నారని ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ దవాఖానలో పని చే స్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సైతం బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో సిబ్బందిలో మార్పు వచ్చిందని, ఇంకా మరింత మార్పు రావాలన్నారు. ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి, శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీపీఎం రవీందర్ ఉన్నారు.



పాలియేటివ్ కేర్ సెంటర్‌లో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

## రేవంత్ సభకు వెళ్లి వస్తూ..

వీణవంక, నవంబర్ 23 : కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యే సభకు వెళ్ళి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రానికి చెందిన దానవేన స్వరూప గురువారం జమ్మికుంటలో జరిగిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో వెళ్ళింది. సభ ముగిసిన అనంతరం తిరిగి వీణవంకకు వస్తుండగా వల్భాపూర్–నర్సింగాపూర్ గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి కింద పడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జమ్మికుంటకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. స్వరూప భర్త పది సంవత్సరాల క్రితం మృతిచెందగా ఇద్దరు ఆడపిల్లల్ని ఆమే పెంచి పోషిస్తుంది.

# ప్రతిపక్షాలకు ఓటేస్తే అధోగతే

- తెచ్చుకున్న తెలంగాణ పచ్చగుండాలంటే కేసీఆరే ఉండాలి
- ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- 17, 18, 19వ డివిజన్లలో ప్రచారం



17వ డివిజన్‌లో మంత్రి గంగులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ యువత

కార్పొరేషన్, నవంబర్ 23: ఈ ఎన్నికల్లో తప్పుడు ప్రచారాలు నమ్మి బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్తు తరాలు అధోగతి పాలవుతాయని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 17, 18, 19 డివిజన్లలో ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా మంత్రికి మహిళలు ఘనస్వాగతం పలుకుగా బీఆర్ఎస్ శ్రేణులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. సమైక్య పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నీళ్లకు, కరెంట్‌కు నోచుకోక నగరం అస్తవ్యస్తంగా ఉండేదని గుర్తు చేశారు. సమైక్య పాలనలో ఆంధ్ర ముఖ్యమంత్రులు అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారంతో మన నీళ్లు నిధులు మనకు వచ్చాయని తెలిపారు. వేల కోట్లు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేశానన్నారు. నగరంలో ప్రధాన అంతర్గత రోడ్లు సుందరంగా నిర్మించామని పేర్కొన్నారు. స్వయం పాలనలో టీటీడీ ఆలయం, ఇస్కాన్ టెంపుల్, ఈద్గాకు స్థలం కేటాయింపు, ఐటీ టవర్, మానేరు రివర్ ఫ్రంట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ముసుగులో ఆంధ్రోళ్లు హైదరాబాద్‌లో అడ్డా వేశారని విమర్శించారు. కేసీఆర్‌ను ఓడగొట్టి తెలంగాణను దోచుకునేందుకు కుట్రలు పనుతున్నారని విమర్శించారు. కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేమన్నారు. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ వ్యతిరేక పార్టీలని విమర్శించారు. కాంగ్రెస్ రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందన్నారు. ఆయనను గెలిపిస్తే మన భూములను కబ్జా చేస్తాడని విమర్శించారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఎప్పుడైనా కనిపించాడా ? అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం మంత్రిగా వేల కోట్ల నిధులు తెచ్చానని, మరీ ఎంపీగా బండి సంజయ్ ఒక్క రూపాయి అయిన తెచ్చాడా అని నిలదీశారు. ఎంపీగా నాలుగున్నరేండ్లలో అక్రమంగా ఆస్తులు కూడబెట్టాడే తప్ప కేంద్రం నుంచి మోదీని అడిగి నిధులు మాత్రం తీసుకురాలేకపోయాడన్నారు. తను చేసిన అక్రమాలతో ఎంపీ టికెట్ ఇవ్వరని ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చాడని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేదే బీఆర్ఎస్ మాత్రమేనని, కాబోయే సీఎం కేసీఆర్ అన్నారు. తనను మరో సారి గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే మరింత ఉన్నత పదవితో వస్తానని, నగరాభివృద్ధిని మరింతగా పెంచుతానని హామీ ఇచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఢిల్లీ దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. ప్రతిపక్షాలకు ఓటేస్తే భవిష్యత్తులో మన పోరగాళ్ల నోట్లో మన్ను కొట్టినట్లే అవుతుందన్నారు. 30న బ్యాలెట్‌లో ఉన్న మొదటి నంబర్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. కా ర్యక్రమాల్లో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, గ్రంథాలయ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు కోల భాగ్యలక్ష్మీప్రశాంత్, ఏదుర్ల రాజశేఖర్, సుధగోని మాధవి కృష్ణగౌడ్, నాయకులు నందెల్లి ప్రకాశ్, మల్లేశం, రాజేందర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు బుడగ జంగాల మద్దతు

- కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ
- ఏకగ్రీవ తీర్మానం చేసిన బుడగ జంగం హక్కుల పోరాట సమితి



తీర్మానం కాపీని సాయినాథ్‌రెడ్డికి అందజేస్తున్న తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి నాయకులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 23: హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కౌశిక్‌రెడ్డి తండ్రి పాడి సాయినాథ్‌రెడ్డికి స్థానిక 23వ వార్డు కౌన్సిలర్ మొలుగు సృజన పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం ప్రతిని అందజేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోటం రామ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటం వెంకటేశ్ మాట్లాడారు. బుడగ జంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించి దళిత బంధు పథకాన్ని వర్తింపజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు బుడగజంగం కులస్తులందరూ రుణపడి ఉంటామన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని బుడగ జంగాల కులస్తులు బీఆర్ఎస్ అభ్యర్థులకు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అంతేగాక ఏకగ్రీవ తీర్మాన ప్రతిని పాడి సాయినాథ్‌రెడ్డికి అందించారు. అనంతరం 100 మంది బుడగ జంగాలు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోతే సమ్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మోటం రామచంద్రం, నాయకులు తూర్పాటి పెద్దిరెడ్డి సమ్మయ్య, గంధం రవి, గంధం రాజు, తూర్పాటి పృథ్వీరాజ్, చెన్నూరి నరేశ్, తూర్పాటి శ్రీనివాస్, మోటం మధుకర్, యూత్ జిల్లా అధ్యక్షుడు తూర్పాటి శ్యామ్, నాయకులు టీ శంకర్, మోటం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎపిక్ నెంబర్ తెలిస్తే చాలు.. ఓటేయచ్చు

- పోలింగ్ స్లిప్పులు అందకపోయినా సమస్య ఉండదు
- ఓటర్ హెల్ప్ యాప్‌తో పీఎస్ వివరాలు తెలుసుకోవచ్చు

కలెక్టరేట్, నవంబర్ 23: శాసనసభ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన పోలింగ్ స్లిప్పు లేకున్నా, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఎన్నికల సంఘం కేటాయించిన ఎపిక్ నెంబర్ తెలిస్తే చాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటేయచ్చు. ప్రతి ఒక్క రూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఓటర్లకు కల్పిస్తున్న పలు రకాల అవకాశాల్లో భాగంగా ఓటరు క్రమ సంఖ్యతో కూడా ఓటు వేసే వీలు కల్పించింది. ఈమేరకు సంబంధిత అధికారులకు కూడా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 10,59,215 మంది ఓటర్లుండగా, వీరందరికీ ఎన్నికల సంఘం వారి వారి పోలింగ్ కేంద్రాలు సూచిస్తూ, ఓటర్ ఇన్‌పర్మేషన్ స్లిప్పులు ముద్రించింది. వాటన్నింటిని నియోజకవర్గాలు, పోలింగ్ బూత్‌ల వారీగా విభజించి పంపిణీ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇప్పటి వరకు 70శాతానికి పైగా స్లిప్పులు బీఎల్‌వోల ద్వారా పంపిణీ కూడా చేశారు. అయితే చాలా మంది ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో నివసించడం, ఉదయమే తమతమ పనులకు వెళ్తుండగా వారికి అందించలేకపోతున్నారు. ఈనేపథ్యంలో స్లిప్పుల్లేకుంటే తమను ఓటేయనిస్తారో లేదోననే భయం వారిలో నెలకొన్నది. అయితే అధికారులు మాత్రం అలాంటి భయాలకు లోనుకావద్దని సూచిస్తున్నారు. పోలింగ్ సమయంలో కూడా ఆయా పోలింగ్ కేంద్రాల సమీపంలో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి, ఓటర్ ఇన్‌పర్మేషన్ స్లిప్పులు అందజేస్తారని వెల్లడిస్తున్నారు. దీంతో పాటు ఓటర్ల జాబితాలో ఓటరు క్రమసంఖ్య తెలుసుకుని పోలింగ్ కేంద్రంలోని సిబ్బందికి చెప్పడం ద్వారా కూడా ఓటు వేయవచ్చని సూచిస్తున్నారు. అలాగే ఓటరు హెల్ప్‌లైన్ యాప్ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డుపై ముద్రించిన ఎపిక్‌నెంబర్ ద్వారా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్ యాప్ వివరాలు తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల్లో, వెలుపల గోడలపై ఓటర్ల జాబితా అతికిస్తారు. జాబితాలో పేరు ఉన్నట్లైతే ఏదైనా ఇతర గుర్తింపుకార్డు తీసుకుని వెళ్లి స్వేచ్ఛగా ఓటు వేయవచ్చని ఎన్నికలఎన్నికల సంఘం పేర్కొంటుంది.